


రెస్టారెంట్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు

షాద్‌నగర్, మే 31 : షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో గల రెస్టారెంట్లపై శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు నిర్వహించారు. రెస్టారెంట్లలో కుళ్లిన, నిల్వ ఉంచిన మాంసాన్ని గుర్తించారు. కాలం చెల్లిన, నాసిరకం పాల ప్యాకెట్లు వాడుతున్నారని ఆహారభద్రత అధికారులు తెలిపారు. వంట పాత్రలు, కిచెన్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని, శుభ్రత పాటించని రెస్టారెంట్లపై కేసులు నమోదు చేశామని జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి ఉదయ్‌కిరణ్ తెలిపారు.


పరిశీలిస్తున్న అధికారి



మరో 3 రోజులు ఉత్కంఠ!

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల ఫలితాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. చేవెళ్ల స్థానంలో 43 మంది, మల్కాజిగిరిలో 22 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఓట్ల లెక్కింపునకు ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శశాంక, గౌతమ్‌ల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 4వ తేదీ ఉదయం ఆరు గంటలకల్లా లెక్కింపు కేంద్రాలకు అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు చేరుకుంటారు. కౌంటింగ్ విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది పొరపాట్లకు తావివ్వకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫలితాలను ఆలస్యం చేయకుండా రౌండ్ల వారీగా వెంటవెంటనే ప్రకటించనున్నారు. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అందరి దృష్టి ఎన్నికల కౌంటింగ్‌పైనే..

- చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల ఫలితాలపై నేతలు, పార్టీలు, ప్రజల్లో ఉత్సుకత
- బీఎస్‌ఐటీలో చేవెళ్ల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు
- మూడు చోట్ల మల్కాజిగిరి స్థానం ఓట్ల కౌంటింగ్
- విజయావకాశాలపై అభ్యర్థుల ధీమా

(రంగారెడ్డి అర్బన్/మేడ్చల్, ఆంధ్రజ్యోతి మే 31): లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. ఎన్నికల ఫలితాలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపునకు మరో మూడు రోజులే ఉంది. జూన్ 4 ఉదయం నుంచి ఓట్లు లెక్కిస్తారు. ఎన్నికల ఫలితాలపై సాధారణ ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హోరాహోరీగా తలపడిన అభ్యర్థులు తమ విజయావకాశాలపై అంచనాలతో ధీమాగా ఉన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల శాతంపై లెక్కలు ఇప్పటికే తీసుకున్నారు. అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజరవర్గాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 15,04,260 మంది కాగా, మహిళా ఓటర్లు 14,33,830 ఉన్నారు. 280 మంది ఇతరులు ఉన్నారు. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 16,57,107 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓవరాల్‌గా 56.4శాతం పోలింగ్ నమోదైంది. ఈ స్థానం బరిలో 43 మంది అభ్యర్థులున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 8,53,237 మంది పురుషులు, 8,03,827 మంది మహిళలు, 43 మంది ఇతరులు ఉన్నారు. చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బండారు శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం 6గంటలకల్లా కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు వస్తారు. ర్యాండమైజేషన్ జరిపిన తర్వాత నియోజకవర్గాల వారీగా టేబుళ్లను కేటాయిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్ నియోజకవర్గాలకు 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బంది అన్ని విధాలా సన్నద్ధమయ్యారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. సమయం వృథా చేయకూడదని, అదే సమయంలో పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా జిల్లా ఎన్నికల అధికారి శశాంక చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ అధికారులు, రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు అన్ని నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అధికారులు.. అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు తెలియజేస్తారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ, ప్రతీ రౌండ్ లెక్కింపు పూర్తిచేసిన తరువాత ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏమైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వెంటనే సరిచేసేలా సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణకు నియమించిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా ట్రైనింగ్ ఇచ్చారు. కౌటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, సిబ్బందికి అల్పాహారం, భోజనాలను కూడా కౌంటింగ్ కేంద్రాల ఆవరణల్లోనే ఏర్పాటు చేస్తారు.


హోలీమేరీ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌతమ్

గంటకు నాలుగు రౌండ్లు

ఒక్కో రౌండుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుంది. గంటకు నాలుగు రౌండ్లు పూర్తవుతాయి. ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యాకే రౌండ్ల వారీగా ఓట్లను క్రోడీకరించి ఫలితం ప్రకటిస్తారు. ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో అత్యధికంగా 21రౌండ్ల లెక్కింపు జరుగనుండటంతో 5గంటలకుపైగా సమయం పడుతుంది. ఆ తర్వాతే తుది ఫలితం వెలువడనుంది. విజేత ఎవరో మధ్యాహ్నం 2గంటల కల్లా తెలిసే అవకాశమున్నా... అధికారికంగా మాత్రం సాయంత్రమే ప్రకటన వెలువడుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

లెక్కిస్తారిలా ...

కౌంటింగ్ కేంద్రంలో ప్రతి నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన టేబుళ్లపై రౌండ్ల, పోలింగ్ కేంద్రాల వారీగా కంట్రోల్ యూనిట్లను తీసుకొచ్చి రిజల్ట్ మీటనొక్కి అభ్యర్థులకు పడిన ఓట్లను నమోదు చేస్తారు. చివరగా 17ఏ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూశాక అన్ని టేబుళ్ల వారీగా అభ్యర్థులకొచ్చిన ఓట్లను రౌండ్ల వారీగా వెల్లడిస్తారు. అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంటు, మైక్రోఅబ్జర్వర్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపడతారు.

మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	కౌంటింగ్ టేబుల్స్	రౌండ్ల సంఖ్య
మేడ్చల్	591	28	21
మల్కాజిగిరి	418	20	21
కుత్బుల్లాపూర్	592	28	21
ఉప్పల్	407	20	20
కూకట్‌పల్లి	417	20	21
కంటోన్మెంట్	232	14	17
ఎల్బీనగర్	571	28	20

చేవెళ్ల లోక్‌సభ స్థానానికి టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	కౌంటింగ్ టేబుల్స్	రౌండ్ల సంఖ్య
మహేశ్వరం	537	28	20
రాజేంద్రనగర్	543	28	20
శేరిలింగంపల్లి	633	28	23
చేవెళ్ల	298	14	22
పరిగి	305	14	22
వికారాబాద్	284	14	21
తాండూరు	277	14	20
పోస్టల్ బ్యాలెట్	19,290	24+1	02

మూడు చోట్ల కౌంటింగ్

ఇక ఓటర్ల పరంగా దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఈ నెల 13న ఎన్నికలు జరగ్గా.. ఏడు నియోజకవర్గాల పరిధిలో 2,528 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 39,79,596 మంది ఓటర్లకు 50.72శాతం మంది ఓటు వేశారు. నియోజకవర్గాల వారీగా ఓట్లను లెక్కించనున్నారు. ఎప్పటి మాదిరిగానే టేబుళ్లపై ఈవీఎంలకు అనుసంధానించిన కంట్రోల్ యూనిట్లతో లెక్కింపును కొనసాగిస్తారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలుండగా.. మూడు చోట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును కీసరలోని హోలీ మేరీ ఇంజినీరింగ్ కాలేజీలో.. ఎల్బీనగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ స్టేడియంలో, కంటోన్మెంట్ నియోజకవర్గ ఓట్లను వెస్లీ కాలేజీలో లెక్కించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నీటి పారుదల శాఖలో అవినీతి తిమింగలాలు

- లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నలుగురు అధికారులు

రంగారెడ్డి అర్బన్, మే 31: నీటి పారుదల శాఖలో నలుగురు అధికారులు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు పట్టుబడ్డారు. ఇంటి నిర్మాణానికి ఎన్వోసీ ఇచ్చేందుకు రంగారెడ్డి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా జిల్లా ఈఈ భన్సీలాల్, ఏఈలు కార్తీక్, నిఖేశ్‌లను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డిమాండ్‌కు సంబంధించి మరో కీలక అధికారి త్రుటిలో తప్పించుకోవడంతో అర్ధరాత్రి వరకు హైడ్రామా కొనసాగింది. ఆయన్నీ అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన అధికారులు పొద్దుపోయే వరకు సోదాలు చేశారు. 4 గంటలు శ్రమించి నాలుగో వ్యక్తినీ అధికారులు పట్టుకున్నారు. నలుగురిని నాంపల్లిలో గల ఏసీబీ కార్యాలయానికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధి నెక్నాంపూర్‌నకు చెందిన బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి తన ఇంటి నిర్మాణం కోసం(ఎన్వోసీ ఇచ్చేందుకు) రంగారెడ్డి జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. ఈఈ భన్సీలాల్, ఏఈలు కార్తీక్, నిఖేశ్ ముగ్గురూ రూ.2.5లక్షలు లంచం ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తామన్నారు. దీంతో ఉపేంద్రనాథ్‌రెడ్డి మొదట రూ.1.5లక్షలు ముట్టజెప్పారు. ఒప్పందం మేరకు మరో రూ.లక్ష ఉంది. ఈ మొత్తాన్ని గురువారం సాయంత్రం ఈఈ కార్యాలయంలోనే ఇవ్వాలని అధికారులు చెప్పారు. ఈ లోపు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు నిఘా పెట్టారు. నీటి పారుదల శాఖ అధికారులు రాత్రి 8గంటల సమయంలో లక్ష లంచ తీసుకుండగా పట్టుకున్నారు. లంచం తీసుకోవడంతో కీలకపాత్ర పోషించిన అధికారి అప్పుడే అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు 4గంటల పాటు ఆయన ఆచూకీ కోసం శ్రమించిన ఏసీబీ అధికారులు చివరకు పట్టుకున్నారు. జాగ సర్వేకు సర్వేయర్ గణేష్ కూడా రూ.40వేలు డిమాండ్ చేశారని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎవరైనా ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని, అలాంటి ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని, టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి వివరాలు తెలపాలని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

యూనిఫామ్ కొలతల్లో తేడా రానివ్వొద్దు


- కలెక్టర్ శశాంక

మొయినాబాద్ రూరల్, మే 31 : విద్యార్థులతో తీసుకున్న కొలతల ప్రకారమే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టాలని, విద్యార్థులకు సప్పేలా కుట్టి సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం చిలుకూరులోని మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్‌ను పరిశీలించారు. రోజుకు ఎన్ని జతల స్కూల్ డ్రెస్సులు కుడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. డ్రెస్సుల స్టిచింగ్‌లో నాణ్యత పాటించాలన్నారు. మన్నికగల మెటీరియల్‌నే వాడాలన్నారు. ఆర్థికంగా వృద్ధి చెందేందుకే మహిళా సంఘాలకు డ్రెస్‌ల స్టిచింగ్ అప్పగించాలమని తెలిపారు. కుట్టు అనంతరం ఈ నెల 10వ తేదీ లోపు స్కూళ్లకు అప్పగించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్ఐ చారి, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు అశ్విని, మంజుల, జియా, అనిత, స్వప్న సభ్యులు తదితరులు ఉన్నారు.

జిల్లాలో విత్తనాల కొరత లేదు

జిల్లాలో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాల కొరత లేదని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం ఆయన మొయినాబాద్‌లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. పత్తి, ఇతర విత్తనాల లభ్యత, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను పరిశీలించారు. బూజు పట్టిన పత్తి విత్తనాలను ఎట్టిపరిస్థితుల్లో విక్రయించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. డీలర్లు ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులను అమ్మాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, ఏవో రాఘమ్మ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.


కుట్టు సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

మహేశ్వరం, మే 31: మహేశ్వరం నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జీహెచ్‌ఎంసీ డివిజన్లలో జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. జూన్ 1న సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ, 2న సాయంత్రం 6 గంటలకు అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మానాలు, 3న ఎవరి ప్రాంతాల్లో వారు జాతీయ జెండాల ఆవిష్కరణలు, ఆస్పత్రుల్లో, అనాథాశ్రమాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేపట్టాలన్నారు. ఉత్సవాల విజయవంతానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.నవీన్, కె.ప్రభాకర్, డి.కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనులు భేష్

- నజ్దిక్‌సింగారం, చింతపట్ల, గడ్డమల్లయ్యగూడల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల పర్యటన

యాచారం, మే 31 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ కింద కూలీలు వర్షం నీరు వృథా కాకుండా సరిహద్దు కందకాలు తవ్వుతున్న పనులు ప్రశంసనీయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమ నిర్వాహకులు కితాబిచ్చారు. ఎండకాలంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కూలీలు పనులు చేస్తూ ఉపాధి పొందడం మంచి విషయమన్నారు. శుక్రవారం కేంద్ర అధికారులు అవనీంద్రకుమార్, పంకజ్‌రాణా, కిరణ్‌పిమలీ, అమిత్‌కుమార్, హన్సల్ సుతూర్, పంకజ్‌రాణా, శివం లోహాని, కిరణ్‌చరణ్ పాండే బృందం మండలంలోని చింతపట్ల, నజ్దిక్‌సింగారం, గడ్డమల్లయ్యగూడల్లో పర్యటించి జరుగుతున్న పనులను పరిశీలించారు. కూలీలకు వారంలో ఎంత డబ్బు చేతికందుతుంది, పనిచేస్తున్న చోట తాగు నీరు, మెడికల్ కిట్లు, టెంట్లు ఉన్నాయా? అని కూలీలను అడిగారు. వారవారం వేతనాలు మీ ఖాతాల్లో జమవుతున్నాయా? అని తెలుసుకున్నారు. హరితహారం నర్సరీలు తనిఖీ చేసి మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణ చర్యలపై వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యక్రమాల్లో రికార్డులను తనిఖీ చేశారు. సరిహద్దు కందకాల తవ్వకాల తీరును అధికారులు పరిశీలించారు. కూలీలు చేస్తున్న పనులను చూసి మెచ్చుకున్నారు. కేంద్ర నిధులతో వేసిన సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. మండలంలో 24 హరితహారం నర్సరీలున్నాయని, వాటిల్లో 2.4లక్షల మొక్కలు పెంచుతున్నామని ఏపీడీ సక్రియా కేంద్ర బృందానికి తెలిపారు. ప్రతీ కూలీకి ఎన్ని రోజుల పని కల్పిస్తున్నారనే విషయమై ఎంపీడీవో నరేందర్‌రెడ్డి వివరించారు. జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే గంటల వ్యవధిలోనే కార్డిచ్చి పనులు చూపుతున్నారని మల్లయ్య అనే కూలీ అధికారులకు తెలిపాడు. కంపోస్టు ఎరువు తయారీపై అధికారులకు వివరించారు. కేంద్ర బృందం వెంట రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ నర్సింలు, డీఆర్డీవో శ్రీలతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, రాష్ట్ర ఉపాధి హామీ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్లు మల్లేశ్వర్‌రావు, అబెద్‌ఖాన్, కృష్ణమూర్తి, మురళీధర్, ఏవో సందీప్‌కుమార్, ఎంపీవో ఉమారాణి, ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


నజ్దిక్‌సింగారంలో కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కన్సల్టెంట్ హన్సల్ సుతూర్

ఉపాధి నిధుల సద్వినియోగంతో అభివృద్ధి

కూలీలకు పని కల్పించడం, గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథక నిధులు ఉపయోగపడుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కన్సల్టెంట్ హన్సల్ సుతూర్ అన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా ల్యాండ్‌వెల్లింగ్ పనులు, ఇతరేతర పనులు చేసుకోవడం అభినందనీయమన్నారు. సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నా కేంద్ర నిధులు ఎంత మేర సద్వినియోగమవుతున్నాయో తెలుసుకునేందుకే తాము తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎండ కాలంలో కూలీలకు, రైతులకు ఉపాధి కల్పించడమే పథకం లక్ష్యం అన్నారు.

మండుతున్న ఎండలు

- మూసారంబాగ్‌లో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



రంగారెడ్డి అర్బన్, మే 31 : కొన్ని రోజులు కాస్త తెరిపినిచ్చిన ఎండలు మళ్లా మండుతున్నాయి. బయటికెళ్తే ఎండ.. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో జనం అవస్థలు పడుతున్నారు. రోహిణి కార్తెలో రోకళ్లు పగిలే ఎండలు కొడుతున్నాయి. ఈ యేడు రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయని వాతావరణశాఖ తెలపడంతో జనం ఆశతో ఎదురు చూస్తున్నారు. రోహిణి కార్తె ప్రారంభమై ఐదు రోజులు దాటుతున్నా చినుకు రాలలేదు. మబ్బులను చూసి వర్షమొస్తుందేమోనని ఆశిస్తే నిరాశే మిగులుతోంది. రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఓ మోస్తరు వర్షం కూడా పడలేదు. వర్షం పడితే విత్తనాలు వేద్దామని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే వారం రోజులుగా జిల్లాలో 42 డిగ్రీలకు పైబడే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ ప్రాంతంలోని మూసారంబాగ్‌లో అత్యధికంగా 43.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా బట్వారంలో 43.1డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం వనస్థలిపురంలో 42.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అంకిత భావంతో పనిచేస్తే సంతృప్తి

● కలెక్టర్ సి నారాయణరెడ్డి

వికారాబాద్, మే 31: ప్రతీఉద్యోగి నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తే మనసుకు సంతృప్తిని కలిగిస్తుందని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డి.సుధారాణిలకు జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ సర్వీస్‌లో అధికారులు నిజాయితీ, పారదర్శకతతో పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డి.సుధారాణిలకు కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఎస్సీ డీడబ్ల్యూవో మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీవైఎస్‌వో హన్మంత్ రావు, డీబీడబ్ల్యూవో ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్ర, డీడబ్ల్యూవో జ్యోతిపద్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పంపిణీకి నోచని బతుకమ్మ చీరలు

కులకచర్ల, మే 31: బతుకమ్మ చీరలు పంపిణీకి నోచుకోక ఎనిమిది నెలలుగా మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వృథాగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన మహిళలకు బతుకమ్మ పండగకు చీరలు పంపిణీ చేసింది. ఇదేక్రమంలో గత బతుకమ్మ పండగకు కూడా చీరలు పంపిణీ చేసేందుకు పంచాయతీలకు బతుకమ్మ చీరలు సరఫరా చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో చీరల పంపిణీకి బ్రేక్ పడింది. ఉమ్మడి కులకచర్ల మండలంలోని 44 గ్రామ పంచాయతీలకు 16 వేల 615 బతుకమ్మ చీరలు వచ్చాయి. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బతుకమ్మ చీరల పంపిణీ మరుగునపడింది. పంచాయతీల్లో పంపిణీకి నోచుకోకుండా ఉన్న బతుకమ్మ చీరలను ఏం చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



పుట్టపహాడ్‌లో ఉన్న బతుకమ్మ చీరలు

పోటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కొడంగల్ రూరల్, మే 31: ఎస్ఈయంఎస్ జాతీయ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ డీవీ.నరేశ్‌రాజ్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన శివరాం, రుచిత, సాహితి, దీపిక ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అదేవిధంగా పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించిన చరణ్‌తేజ్, రాకేశ్, అజయ్ గురుకుల కళాశాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, ఉపాధ్యాయులు అభినందించారు. వీరికి ఈ నెలలో హైదరాబాద్‌లో అవార్డులతో సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హెచ్‌ఎంలకు సెలవులు మంజూరు చేయాలి

కొడంగల్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా వేసవి సెలవుల్లో పాఠశాలల మరమ్మతు పనులను పూర్తి చేయడం లాంటి విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎస్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు విష్ణుకుమార్‌లు డీఈవోతో కోరారు.



డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర వహించాలి



మరికల్ జడ్పీహెచ్ఎస్ సందర్శనలో పీఆర్ డీఈ హనుమంతు

కులకచర్ల, మే 31: పాఠశాలల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీలు కీలకపాత్ర వహించా లని పీఆర్ డీఈ హనుమంతు తెలిపారు. చౌడాపూర్ మండలం మరికల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

190 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

బషీరాబాద్, మే 31 : అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన 190 కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడగా శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని మంతట్టి గ్రామంలో జైపాల్‌రెడ్డి ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే సమాచారంతో సోదాలు నిర్వహించారు. అక్కడ 50కిలోల విత్తనాలు పట్టుబడినట్టు ఆయన వివరించారు. నకిలీ విత్తనాలతో పట్టుబడిన వ్యక్తిని ఆరాతీయగా ఆయనిచ్చిన సమాచారంతో దుద్యాల మండలం పర్సిగడ్డ గ్రామం ముకుంద్‌రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆ ఇంట్లో 140కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడగా స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్టు చెప్పారు. నకిలీ విత్తనాలతో పట్టుబడిన ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.


మద్దుల : పట్టుబడిన పత్తి విత్తనాలు

నిషేధిత విత్తనాల విక్రయం..
ఇద్దరుగురి రిమాండ్

మాడ్గుల, మే 31 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దొడ్డిపురం మల్లిరెడ్డి, అల్లం మల్లిరెడ్డిఅల్లం విరేశంలు ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 రకం పత్తి విత్తనాలను విక్రయిస్తుండగా గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కాగా, అదే కేసును దర్యాప్తు చేస్తుండగా పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు శుక్రవారం కేశంపేట మండలానికి చెందిన అన్నపు రెడ్డి మల్లారెడ్డి, షాద్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన యర్రెడ్డి నల్లపురెడ్డిని శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. వారి నుంచి 850 కిలోల విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.


బషీరాబాద్: నకిలీ విత్తనాలతో పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ రమేష్, పోలీసులు


చందనవెల్లి కుందన్ టెక్స్‌టైల్స్ కంపెనీ వద్ద గ్రామస్తులు

టెక్స్‌టైల్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

షాబాద్, మే 31 : మండల పరిధిలోని చందనవెల్లి వద్ద గల కుందన్ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి వెలువడే వాయు కాలుష్యం కారణంగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. ఈమేరకు ఆ కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నగరంలోని మెంబర్ సెక్రెటరీ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కుందన్ పరిశ్రమ నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు దమ్ము, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాల వల్ల పశువులు నీటిని కూడా తాగడం లేదన్నారు. పంట పొలాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంతులు రాంచందర్‌రావు, ఆంజనేయులు, రామాచారి, గోపాల్, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, నరేష్, రంగయ్య, నత్తయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లేష్, యాదగిరి, కుమార్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

శస్త్ర చికిత్సల పేరుతో దోపిడీ

వచ్చీరాని వైద్యంతో ప్రాణాలు హరీ..!

- పరిగి కేంద్రంగా నెలకు 40కిపైగా గర్భసంచి ఆపరేషన్లు
- నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా తప్పని సిజేరియన్లు

పరిగి, మే 29: ప్రైవేట్ ఆస్పత్రులు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. శస్త్ర చికిత్సలు అవసరం లేకున్నా డబ్బుల కోసం అవసరం ఉన్నట్లు సృష్టిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత లేకుండా వచ్చీరాని వైద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాసుల కోసం ప్రైవేట్ ఆస్పత్రులు, కమీషన్ కోసం ఆర్ఎంపీ వైద్యులు అమాయక మహిళలను బలిచేస్తున్నారు. కడుపు నొప్పి, నడుమునొప్పి అని వెళితే చాలు గర్భసంచి తొలగించేస్తున్నారు. వేలకు వేలు దండుకుంటూ గిరిజన తండాలు, గ్రామాల్లోని మహిళల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. పరిగి కేంద్రంగా మహిళలకు గర్భసంచి తీసివేస్తే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఎక్కువగా గిరిజన మహిళలే బలి పశువులవుతున్నారు. గర్భసంచి తొలగించి ఒక్కో మహిళ నుంచి రూ.40 నుంచి రూ.60వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా పరిగిలో శస్త్ర చికిత్సల ద్వారా నెలకు రూ.20లక్షలకుపైగా లావాదేవీలు జరుగుతున్నట్లు అంచనా. ఇక మందులు, పరీక్షలు ఖర్చులు అదనంగానే వసూలు చేస్తున్నారు. ఇందులో కేసును తీసుకువచ్చే ఆర్ఎంపీ డాక్టర్‌కు కూడా కమీషన్ ఇస్తుంటారు. పరిగి ప్రాంతంలో నెలకు సుమారుగా 40నుంచి 50మంది మహిళలకు గర్భసంచి తొలగించే ఆపరేషన్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇదర రాష్ట్రానికి 30ఏళ్ల మహిళకు గర్భసంచి సమస్య ఉందని సూచించారు. ఇక్కడే సదరు మహిళకు ఆపరేషన్ చేసి గర్భసంచిని తొలగించారు. అయితే ఆమె శస్త్రచికిత్సలు వికటించడంతో హైదరాబాద్‌కు తరలించేలోపే మృతి చెందింది. గతంలో పరిగి మండలం నస్కల్ గ్రామానికి చెందిన మరో మహిళ కూడా గర్భసంచి సమస్యతో మృతిచెందిన సంగతి తెలిసిందే. గతేడాది పూడూరు మండలం నిజాంపేట్ మేడిపల్లి గ్రామానికి చెందిన ఓమహిళ ఇదే సమస్యతో మృతిచెందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇలా ఒకటా రెండా అనేక ఘటనలు కోకొల్లలు. ఇటీవల దోమకు చెందిన ఓ యువతికి సరైన వైద్యం అందకనే మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల కేంద్రంలో ఓ ఆర్ఎంపీ దగ్గర ఊటుపల్లికి చెందిన యువకుడికి వైద్యం అందక మృతిచెందాడు. సదరు ఆర్ఎంపీ డబ్బులు ఇచ్చి సెటిల్ చేశారు. దోమలో ఆర్ఎంపీ వైద్యంతో విద్యార్థిని మృతిచెందగా కేసు నమోదు చేసి చేతులు దులుపేసుకున్నారు. ఒక శస్త్ర చికిత్సలు కాకుండా, ఆర్ఎంపీ డాక్టర్లు వచ్చీరాని వైద్యంతో పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.


పరిగిలో క్లినిక్‌లో బెడ్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు (ఫైల్)

నార్మల్ డెలివరీకి అవకాశమున్నా సిజేరియన్లు

గర్భిణులు డెలివరీకి ఆస్పత్రికి వెళ్తే కడుపుకోత చేస్తున్నారు. పరిగి ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీకి వెళ్లిన వారికి అసలు ప్రయత్నం చేయకుండానే సిజేరియన్లు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. నార్మల్ డెలివరీకి అసలు ప్రయత్నాలు జరగడం లేదు. నార్మల్ డెలివరీ అవడానికి అవకాశమున్నా చేయడం లేదు. డబ్బులకోసం నార్మల్‌ను పక్కనపెట్టి కడుపుకోత చేస్తున్నారు. ఇలాపేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వేలకు వేలు దండుకుంటున్నారు. నార్మల్ డెలివరీ అయితే రూ.20వేలు, ఇదే సిజేరియన్ అయితే రూ.40వేల నుంచి అదును చూసి రూ.80వేల వరకు వసూలు చేస్తున్నారు. పరిగిలో కొడంగల్ వెళ్లే దారిలోని ఓ ఆస్పత్రిలో అయితే దోపిడీ మరీ దారుణంగా ఉంది. ఆరోగ్యం బాగా ఉన్నా, శస్త్రచికిత్సలు అవసరం లేకున్నా డబ్బుల కోసం శస్త్ర చికిత్సలు చేసి ఇష్టం వచ్చినట్లు బిల్లులు వేస్తున్నారు. నిలదీసిన వారిని ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని దబాయిస్తున్నారు. ఆస్పత్రి నిర్వాహకులు చేతులు తడపడం వల్లే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు లేకుండా క్లినిక్‌ల నిర్వహణ

పరిగిలో అనేక క్లినిక్‌లు ఎలాంటి అర్హతలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. ఆర్ఎంపీ చికిత్సలు చేసే అంటిదే క్లినిక్‌లు నర్సింగ్‌హోంలను తలపిస్తున్నాయి. అందులో వచ్చీరాని వైద్యంతో మహిళలకు శస్త్రచికిత్సలు నిర్వహించి పట్టపగలు నిలువుదోపిడీ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లు లేకుండా అర్హతలేని ఆస్పత్రులను యదేచ్ఛగా నడిపిస్తున్నారు. కనీసం మెడికల్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు లేని ఆర్ఎంపీలు ఆస్పత్రులు కొనసాగుతున్నా వైద్యశాఖ అధికారుల అసలు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కరపత్రాలు ప్రకటనలతో ప్రచారం చేసుకుంటూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారు.


పరిగిలో క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న అధికారులు (ఫైల్)

'సిజేరియన్లు చేస్తే చర్యలు'

తాండూరు: గర్భిణీలకు తప్పనిసరి అయితేనే సిజేరియన్ ప్రసవాలు చేయాలని జిల్లా మాతా శిశు ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా అన్నారు. వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పాల్వన్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి సిజేరియన్ ప్రసవాలు చేస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద ఆస్పత్రితో పాటు గైనకాలజిస్టులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కీర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- యువత అధైర్య పడొద్దు.. : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మే 31: సమస్యలు ఎదురైనప్పుడు యువత మనోధైర్యంతో ఎదుర్కొవాలే తప్ప ఆత్మహత్య చేసుకుని కన్న తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగల్చవద్దని, ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని రైతుకాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బుచ్చయ్య పెద్ద కుమార్తె కీర్తి గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బుచ్చయ్య ఇంటికి వెళ్లి కీర్తి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ చదువుకున్న యువతీయువకులు సైతం చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని అన్నారు. చదువులో పెయిల్ అయితే మళ్లీ పరీక్ష రాసి పాస్ కావడానికి అవకాశం ఉందని, ఒకసారి తీసుకున్న ప్రాణం తిరిగిరాదన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో మనోధైర్యం పెరిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. క్రమశిక్షణతో పెరిగి, మనోధైర్యంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదిగేవిధంగా పిల్లల్లో పరివర్తన తేవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు. బుచ్చయ్యను మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో పాటు పార్టీలకు అతీతంగా పట్టణ ప్రముఖులు పరామర్శించారు.

మార్కెట్‌లో రూ.10నోట్ల కొరత

ధారూరు, మే 31: మార్కెట్‌లో రూ.10నోట్ల కొరత నెలకొంది. కొంతకాలంగా మార్కెట్‌లో పది రూపాయల నోట్లు క్రమంగా కనుమరుగవుతూ వస్తున్నాయి. రూ.10నోట్లు చెలామణి తగ్గి నోట్ల రద్దు అనువాటి నుంచి బ్యాంకుల్లో రూ.500, రూ.200, 100, 50నోట్ల చెలామణి పెరిగి చిన్ననోట్ల చెలామణి క్రమేణా తగ్గుతూ వస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో వివిధ వ్యాపారులు చిల్లర దొరకక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలతో పాటు వివిధ రకాల వస్తువులు కొనుగోలు కోసం, కూరగాయల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు చిల్లర సమస్యను ఎదుర్కొంటున్నారు. రూ.50లోపు కొనుగోలుకు నానా అవస్థలు పడాల్సివస్తోందని వాపోతున్నారు. ధారూరు, వికారాబాద్ పట్టణాల్లో ఉన్న పలు బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.10నోట్లు అందుబాటులో ఉండటంలేదు. కాగా గతంలో రిజర్వు బ్యాంకు నుంచి విడుదల చేసిన రూ.10నాణేలు చెల్లవని పుకార్లు వ్యాపించడంతో మార్కెట్‌లో ఆ నాణేలను ప్రజలు తీసుకోకపోవడంతో వాటి చెలామణి నిలిచిపోయింది. వీటితో పాటు ఈ మధ్య గ్రామాల్లో రూ.10, 20, 100 పాత నోట్లు చెల్లవని అసత్య ప్రచారంతో వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారు. రూ.10 నోట్లను బ్యాంకుల్లో అందుబాటులో ఉంచాలని వ్యాపారులు, ప్రజలు రిజర్వు బ్యాంకు అధికారులను కోరుతున్నారు.



రూ.10నోట్లు దొరకక కష్టమవుతోంది

మార్కెట్‌లో రూ.10నోట్లు దొరకటం లేదు. కిరాణ సామగ్రికి వచ్చే వినియోగదారులు రూ.10నోట్లు తీసుకురావడం లేదు. కొంత కాలంగా రూ.10నోట్లు దొరకక రోజువారీ వ్యాపార లావాదేవీలకు కష్టమవుతోంది. బ్యాంకుల్లో రూ.10నోట్లు దొరకటం లేదు. పెట్రోల్ బంకుల్లో రూ.10నోట్లు చిల్లర తెచ్చుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాం. బ్యాంకుల్లో రూ.10నోట్లను అందుబాటులో ఉంచాలి.


- కల్ల కిరణ్ కుమార్, కిరాణ వ్యాపారి, ధారూరు


లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్‌మున్షీ

పుంజాల లక్ష్మీబాయి మృతికి డిప్యూటీ సీఎం సంతాపం

శంషాబాద్, మే 31 : మాజీ గవర్నర్ దివంగత పుంజాల శివశంకర్ భార్య లక్ష్మీబాయి ఇటీవల మృతిచెందారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వారింటికి వెళ్లి లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. శుక్రవారం శంషాబాద్ శివారులోని మామిడిపల్లిలో లక్ష్మీబాయి నివాసానికి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీలు వెళ్లి లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లక్ష్మీబాయి కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్, కోడలు అలేఖ్యలను ఓదార్చి సానుభూతి తెలిపారు.


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

చేవెళ్ల, మే 31 : మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో ట్రాఫిక్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. మొత్తం 82 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఐందుకుగాను రూ. 2లక్షల5వేల 500 జరిమానా విధించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న చుక్కా రామయ్య

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య

కడ్తాల్, మే 31: విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలవాలని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. కడ్తాల మండలం మైసిగండిలోని శ్రీ రామేశ్వర వీరాంజనేయస్వామి దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞానసరస్వతి మందిరంలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సమాజంలో మార్పులు చోటుచేసుకునేందుకు విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గొప్ప ఆలోచనలు విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ శంకర్, స్వామి కుల జ్ఞానప్రసూనశర్మ, శ్రీరాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

- బ్రహ్మోత్సవాలకు రూ.1, 11, 580 ఆదాయం

మహేశ్వరం రూరల్, మే 31: మండలంలోని వెంకటాపూర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన హుండీని శుక్రవారం లెక్కించారు. గతనెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన ఆలయ బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ.1, 11, 580లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ తెలిపారు. భక్తులు స్వామివారి హుండీలో వేసిన డబ్బులను ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. జూలైలో ఆలయంలోని ఆంజనేయస్వామి ఆలయంతో ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎల్.బాగ్యలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు నవీన్, లింగం, శేఖర్, మాజీ సర్పంచ్ నీరుడి గీతాశ్రీనివాస్, నాయకులు పెంటయ్య, వెంకటేష్, శ్రీనివాస్, నర్సింహ, ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


నర్సింహులుతో డీపీఆర్వో, సిబ్బంది

నర్సింహులు సేవలు అమోఘం

- పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి పద్మశ్రీ

రంగారెడ్డి అర్బన్, మే 31 : పౌర సంబంధాల శాఖలో సూపర్‌వైజర్‌గా నర్సింహులు చేసిన సేవలు అమోఘమని డీపీఆర్వో పద్మశ్రీ అన్నారు. ఈమేరకు శుక్రవారం పదవీ విరమణ పొందిన నర్సింహులును డీపీఆర్వోతో పాటు ఏపీఆర్వోలు, సిబ్బంది కలెక్టరేట్‌లోని వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీఆర్వో బాలేశ్వర్, ఏపీఆర్వో మధుసూదన్, ఏపీ సూపర్‌వైజర్ ప్రసాద్, టైపిస్టులు దయానంద్, అజీజ్, రికార్డు అసిస్టెంట్ సురేష్ గౌడ్, డ్రైవర్ ఈశ్వర్, ఫోటోగ్రాఫర్ ప్రవీణ్‌కుమార్, నాలుగో తరగతి సిబ్బంది ఫకీర్, చంద్రకళ, అనిత, హబీబాబేగం, షేక్ లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

- కృత్రిమ కొరత సృష్టించొద్దు : ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, మే 31 : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల విత్తనాల వ్యాపారులు రాష్ట్ర వ్యవసాయ శాఖ నిబంధనలకు లోబడి విక్రయాలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో యాచారం, మాల్, మల్కీజ్‌గూడ గ్రామాలలో అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దుకాణదారులను రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించిన వెంటనే రశీదు ఇస్తున్నారా? లేదా? స్టాక్ రిజిస్టర్లు మెయింటెన్ చేస్తున్నారా? విత్తనాలు, ఎరువులు ఎక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నారనే విషయాలపై ఆరా తీశారు. ఏసీపీ మాట్లాడుతూ ఎరువుల లూజ్ విక్రయించరాదని దుకాణదారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయించి రైతులకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ ఎరువుల విక్రయించరాదని దుకాణదారులను ఆదేశించారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకుండా ప్రతీరోజు స్టాక్ రిజిస్టర్ ఎరువులు తెప్పించుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాలలో బ్లాక్‌లో ఎరువుల విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతీ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కాగా, మాల్ వద్ద నేడు(శనివారం) చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తామని, నకిలీ విత్తనాల తరలింపుపై నిఘా పెట్టనున్నట్టు ఏసీపీ తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జీఎస్ సందీప్‌కుమార్, సీఐ శంకర్‌కుమార్, ఎస్సై వెంకటనారాయణ, ఆర్ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.


ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- కొనసాగుతున్న జాతర
- కర్ణాటక, మహారాష్ట్రల నుంచి రాక

తాండూరురూరల్, మే 31: భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిత్యపూజలతోపాటు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయంలో అమ్మవారికి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక బోనంతో ఆలయం పూజలు నిర్వహించారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

షాబాద్, మే 31 : ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకుంటామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ దళిత మోర్చా మండలాధ్యక్షుడు మహేందర్ అన్నారు. బొబ్బిలిగామ గ్రామానికి చెందిన మల్లేష్ దంపతులు నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. దాంతో వారి ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. మానవతా దృక్పథంతో ఆ చిన్నారులకు కొంత నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. తల్లిదండ్రులు లేని ఇద్దరు పిల్లలను చిలుకూరులోని ఎన్టీఆర్ స్కూల్‌లో డిగ్రీ వరకు ఉచితంగా చదివిస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, నాయకులు గురుస్వామి, నరేష్, ప్రకాష్, మహేష్, రవిగౌడ్, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, మే 31: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన చెవిటి వెంకటయ్య శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.5వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో దేవుని పడకల్ ఎంపీటీసీ సభ్యుడు రఘునాయక్, స్థానిక నాయకులు శ్రీశైలం, శ్రీను, విజయ్, మహేశ్, మహేందర్, మల్లేశ్, ప్రభాకర్, రాములు, అంజయ్య, వెంకటయ్య, శ్రీను, మధు, లష్కర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అనర్థాలు

- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంలో వైద్యులు
- నో టోబాకో డే సందర్భంగా ర్యాలీలు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు, మే 31: పొగాకు ఉత్పత్తులను వాడితే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా. పరీక్షిత్ నరేంద్ర అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురష్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పొగాకు వినియోగం వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర మాట్లాడుతూ పొగాకు వల్ల నోటి, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతాయన్నారు. పొగాకు వినియోగంతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారని తెలిపారు. సిగరెట్, గుట్కా, పాన్ మసాలతో ప్రపంచ మానవాళికి ప్రమాదం పొంచి ఉందన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కౌన్సిలింగ్ కేంద్రం అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ మంజుల, జయశ్రీ, అధికారులు తిరుపతిరెడ్డి, లక్ష్మి, సిబ్బంది నాగేశ్వరి, వేణు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురష్కరించుకుని వైద్య సిబ్బంది షాద్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జగదీశ్వర్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా తిరిగి ఆసుపత్రికి చేరుకుంది. ప్రాణాంతకమైన పొగాకు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతీయేటా ఎనిమిది మిలియన్ల వరకు ప్రజలు మరణిస్తున్నారని జగదీశ్వర్ పేర్కొన్నారు. పొగతాగి అనారోగ్యానికి గురికావద్దని నినాదాలు చేశారు. ధూమపానానికి ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలని జగదీశ్వర్ కోరారు. ర్యాలీలో డాక్టర్ కార్తీక్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : ర్యాలీలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది



షాద్‌నగర్ అర్బన్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ జగదీశ్వర్

క్రైం కార్నర్

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి రిమాండ్

చేవెళ్ల, మే 31 : పాఠశాలకు వెళ్తున్న బాలికను బలవంతంగా లొంగదీసుకొని లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన కొజ్జెంకి సుదర్శన్ అదే గ్రామానికి చెందిన ఓ బాలిక(17) పాఠశాలకు వెళ్తుండగా.. ఆమెను తన కారులో తీసుకెళ్లి దింపుతానని నమ్మించాడు. అనంతరం నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికీ చెప్పవద్దని బాలికను బెదిరించాడు. ఈక్రమంలో మే 28న బాలిక కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడు కొజ్జెంకి సుదర్శన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం ఒప్పుకోవడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నేరానికి ఉపయోగించిన కారును సీజ్ చేశారు. సుదర్శన్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

శిశువు కిడ్నాప్ కేసును ఛేదించిన ఆర్జీఐఏ పోలీసులు



నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్, మే 31 : నెల రోజుల పసిపాప కిడ్నాప్ కేసును శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు డీసీపీ నారాయణరెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. చిన్నా-లక్ష్మి అనే దంపతులు శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకుంటూ శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రాత్రివేళ పడుకుంటారు. వారికి ఇద్దరు సంతానం. పెద్ద కూతురుకు ఐదేళ్లు ఉండగా.. చిన్న కూతురుకు నెల రోజుల క్రితం జన్మనిచ్చారు. ఈక్రమంలో మే 27న దంపతులు నిద్రిస్తుండగా.. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన ముగ్గురు నిందితులు.. దండు హనుమంతు అతడి భార్య చందన సమీప బంధువు స్వాతిలు చిన్నా-లక్ష్మిల నెలరోజుల శిశువును కిడ్నాప్ చేసి తమ వెంట తీసుకెళ్లారు. ఈమేరకు శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులకు దంపతులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పసికందును పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక టీంలను ఏర్పాటుచేసి గాలింపు చేపట్టారు. టెక్నికల్, సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ముగ్గురు నిందితులు ఆ పసికందును విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు శంషాబాద్ సమీపంలో పట్టుకున్నారు. పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపారు. అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ కేఎస్ రామారావు, సీఐ బాలరాజ్, డీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు అప్పారావు, మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్

చేవెళ్ల, మే 31 : గంజాయి విక్రయించిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరబ్రహ్మం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన షామీర్ మియా, నూర్ ఇస్లామ్‌లు సెంట్రింగ్ పనులు చేసేందుకు మండల పరిధిలోని ఎన్కేపల్లి చౌరస్తాలో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈక్రమంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారు. ఈ నెల 30న పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారి వద్ద గంజాయి దొరకడంతో ఇద్దరిని అరెస్టు చేసి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై కారు ఆపి క్యాబ్ డ్రైవర్ హల్‌చల్

శంషాబాద్, మే 31 : ఓ క్యాబ్ డ్రైవర్ శంషాబాద్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం తన కారును రోడ్డుపై ఆపి హల్‌చల్ చేశాడు. గమనించిన ట్రాఫిక్ పోలీసులు తన కారును పక్కకు తీయమని చెప్పగా.. వారితోనూ గొడవకు దిగాడు. అంతలోనే రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాంతో ట్రాఫిక్ పోలీసులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



ట్రాఫిక్ పోలీసులతో గొడవపడుతున్న క్యాబ్ డ్రైవర్

ఫిరంగి కాల్వలో పడి వృద్ధుడు మృతి

శంకర్‌పల్లి, మే 31: ప్రమాదవశాత్తు ఫిరంగి కాల్వలో పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జన్వాడ గ్రామానికి చెందిన నాంపల్లి మల్కయ్య(65) ఉదయం పూట చెత్త పారవేసేందుకు గ్రామంలోని ఫిరంగి కాల్వ వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో కాలుజారి అందులో పడిపోయాడు. ఆయన ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం పూట ఫిరంగి కాల్వ నీటిలో శవమై తేలాడు. స్థానికుల సమాచారంతో కుటుంబికులు ఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు.

నకిలీ విత్తనాలమ్మితే క్రిమినల్ కేసులు

- వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు
- విస్తృతంగా ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు



చేవెళ్ల : రికార్డును పరిశీలిస్తున్న అధికారులు



శంకర్‌పల్లి : తనిఖీ చేస్తున్న అధికారులు

చేవెళ్ల, మే 31 : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య స్పష్టం చేశారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల స్టాక్ వివరాలతో పాటు పత్తి విత్తనాల ప్యాకెట్లు పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు లూజు విత్తనాలను అమ్మవద్దన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రషీదులను ఇవ్వాలన్నారు. ఏవో తులసి, ఆర్ఐ రాజేశ్, ఎస్సై వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. శంకర్‌పల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులైన వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, ఉప తహసీల్దార్ ప్రియాంక, ఎస్సై సంతోష్‌రెడ్డిలు తనిఖీ చేశారు. దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు ఎదుర్కొనడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణంలోని విత్తన, ఎరువుల దుకాణాలను, గోదాములను అధికారుల బృందం తనిఖీ చేసింది. వానాకాలం పంటల సాగు కోసం తెచ్చిన విత్తన, ఎరువుల నిల్వలు, విక్రయ రసీదులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి, మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, డీటీ ఆనంద్‌సింగ్, వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణాదారు లైసెన్స్ రద్దు చేస్తామని కేశంపేట మండల వ్యవసాధికారి శిరీష హెచ్చరించారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ లింగం, డిప్యూటీ తహసీల్దార్ గీతలతో కలిసి ఎరువులు, విత్తనాలు దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. విత్తనాలు తీసుకున్న రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. అలాగే అధిక ధరలకు విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని ఆమె తెలిపారు.

కొత్తూర్ : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖాధికారులు స్థానిక ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి లైసెన్స్‌లతో పాటు, స్టాక్ పట్టికలను పరిశీలించారు. రైతులను నమ్మించి మోసం చేసి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి గోపాల్ మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొనగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. పంట పూర్తి అయ్యే వరకు బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎస్సై కె.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి కవిత హెచ్చరించారు. మల్కారం, చిన్నగోల్కొండ, గండిగూడలో ఉన్న పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సైలు రాజ్‌కుమార్, సర్ధార్, వ్యవసాయ శాఖ ఏవో కవిత సంయుక్తంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న మందుల ప్యాకెట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్‌లు కలిగి దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడితే మొదటికే మోసమని, రైతులు విత్తనాలు కొనే ముందు జాగ్రతగా చూసుకోవాలని సూచించారు.



ఆమనగల్లు : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అరుణకుమారి

ఆమనగల్లు : పంటలు సాగు చేసే రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. మేడిగడ్డతండా, శంకర్‌కొండతండా, గౌరారం గ్రామాల్లో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులతో ప్రత్యేకంగా సమావేశమై సాగులో అవలంబించవలసిన పద్ధతులను వివరించారు. పచ్చిరొట్ట, ఎరువుల విత్తనాలు వేసవి దుక్కులు, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి వంటి చర్యలతో రైతుకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. సాగులో ఎటువంటి అనుమానులు తలెత్తినా వ్యవసాయాధికారులను సంప్రదించి వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సై బాల్‌రాంనాయక్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌ల బృందం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనఖీ చేశారు. దుకాణాల రికార్డులు పరిశీలించి తగు సలహాలు సూచనలు చేశారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏఈవోలు రాణి, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : నకిలి విత్తనాలు విక్రయించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కడ్తాల సీఐ శివ ప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి శ్రీలతతో కలిసి సీఐ తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్, విక్రయాల రికార్డులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు అవినీతి అక్రమాలకు పాల్పడి రైతులను మోసాలకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదులు ఇవ్వాలన్నారు. ఈపాస్ ద్వారా ఎరువులను విక్రయించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, ఏఈవో అభినవ్, డీలర్ సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు



కొత్తూర్ : ఎరువుల దుకాణాన్ని తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు



కేశంపేట : తనిఖీ చేస్తున్న ఏవో శిరీష, ఎస్సై లింగం



కడ్తాల్ : ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ శివప్రసాద్, ఏవో శ్రీలత



శంషాబాద్ రూరల్ : మల్కారంలో తనిఖీ చేస్తున్న ఏవో కవిత, ఎస్సై రాజ్‌కుమార్

పాఠశాలల పునఃప్రారంభానికల్లా

అన్ని వసతులు కల్పించాలి

ఇబ్రహీంపట్నం, మే 31 : పాఠశాలలు తెరిచేనాటికి మండలంలోని ప్రతీ పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ముకునూర్ ప్రాథమిక పాఠశాలను అధికారులతో కలిసి సందర్శించారు. మండలంలో 17 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. 17 పాఠశాలలకు రూ.17లక్షల నిధులున్నాయని, వాటితో మంచినీటి వసతి, టీవీ, కంప్యూటర్, ఎల్ఈడీ. ఎలక్ట్రీషియన్ పరికరాలు, సైన్స్ పరికరాలను అందుబాటులో పెట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. గదులకు పెయింటింగ్ చేయాలని చెప్పారు. బడులను అందంగా మార్చడం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చి దిద్దడం కోసం శ్రమపడాలని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో క్రాంతికుమార్, ఇన్‌చార్జి ఎంఈవో వెంకటరాంరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ఇంద్రసేనారెడ్డి, నోడల్ అధికారి శ్రీనివాస్, ఎంపీటీసీ జ్యోతిభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముకునూర్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ కృపేష్ తదితరులు

మండలాభివృద్ధికి సహకారం అభినందనీయం

కేశంపేట, మే 31: కేశంపేట మండలాభివృద్ధికి అధికారులు బాగా సహకరించారని, వారందరికీ ధన్యవాదాలని, మా పదవి కాలంలో ఇదే ఆఖరు సర్వసభ్య సమావేశం కావచ్చని కేశంపేట ఎంపీపీ వైర వీందర్ యాదవ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడంతో అత్యవసర అంశాలు చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ త్వరలోనే తమ పదవీకాలం పూర్తి అవుతుందని, ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావచ్చన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో అధికారులను కాస్త గట్టిగానే మందలించి ఉండవచ్చని, అభివృద్ధి జరగాలనే ఉద్దేశ్యంతోనే ప్రశ్నించాల్సి వచ్చిందని తెలిపారు. అధికారులు అవన్నీ మనుసులో పెట్టుకోవద్దని, అధికారులందరూ ఎంతగానో సహకరించారని తెలిపారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, తహసీల్దార్ మీర్ ఆజంఅలీ, వైస్ ఎంపీపీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్ యాదవ్

అభివృద్ధి పనులకు నిధులు కరువు : ఎంపీపీ

మాడ్గుల, మే 31 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు నిధులు సకాలంలో అందించకపోవటంతో అభివృద్ధి పనులు ముందుకెళ్లడం లేదని ఎంపీపీ గౌరవరం పద్మ అన్నారు. మాడ్గుల మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేనందున వాయిదా వేసినట్లు ఎంపీపీ తెలిపారు. జూలై 16న ఆఖరి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. అనంతరం ఎంపీపీ తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయక దాదాపు రెండు సంవత్సరాలు అవుతోందని, సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు బాధ్యతలు అప్పజెప్పారని చెప్పారు. పంచాయతీ సిబ్బందికి దాదాపు 6నెలలుగా జీతాలు అందలేదని ఎంపీపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పాండుగౌడ్, నారమ్మ, లక్ష్మమ్మలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

నేడు విద్యుత్ సరఫరా నిలివేత

శంషాబాద్, మే 31 : శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి 11 కేవీ ఫీడర్, 11 కేవీ నర్కోడ అగ్రికల్చర్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లు కొట్టి వేస్తున్నందున నేడు(శనివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్‌బాషా తెలిపారు. అలాగే సుల్తాన్‌పల్లి, కోల్‌బావుల దొడ్డి, బ్యూటీ గ్రీన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నర్కోడ అగ్రికల్చర్ ఫీడర్ అమ్మపల్లి, చౌదరిగూడ, సిరిసిరిమక్త ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కందుకూరు మండల పరిధిలో..

కందుకూరు, మే 31 : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) మండలంలోని ముచ్చర్ల, కందుకూరు, గ్రామాల పరిధి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో రెండు ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వి.రమేష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముచ్చర్ల, కందుకూరు గ్రామాలలోని మహ్మద్‌నగర్, దెబ్బడగూడ, ఫీడర్లలో చెట్ల కొమ్మలు నరికేస్తుండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు, మే 31: పట్టణంలోని శ్రీకాంత్‌కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగిళ్ల వెంకటేశ్ మాతృమూర్తి పుష్పలత శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.



బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేత

కడ్తాల్, మే 31: ప్రతీఒక్కరు వ్యక్తిగత ఆరోగ్య సూత్రాలు పాటించాలని కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకు పెరుగుతుండడం ఆందోళన కల్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కడ్తాల మండలంలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన కావలి సాయిలు, కావలి గణేశ్‌లకు కిడ్నీమార్పిడి చికిత్స నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో విజయవంతంగా జరిగింది. వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబం కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్‌కు ఆశ్రయించగా.. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ప్రభుత్వం వైద్య ఖర్చుల నిమిత్తం కావలి సాయిలుకు రూ.1.60లక్షలు, కావలి గణేశ్‌కు రూ.2.50లక్షలు కలుసుకుని మొత్తం రూ.4.10లక్షల రూపాయలు మంజూరు చేసింది. శుక్రవారం జడ్పీటీసీ ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్వోసీలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీ ప్రియారమేశ్, మాజీ ఎంపీపీ సువాలి పంతునాయక్, గోపాల్, సీతారాంనాయక్, జైపాల్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.



ఎల్వోసీ అందిస్తున్న దశరథ్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాచారం, మే 31 : తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పించడం కోసం కృషి చేస్తామని నందివనపర్తి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన 2000-01 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఆనాడు తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో గురువులు తమ పట్ల చూపిన అభిమానమే మమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు